## పువ్వాడ అజయ్‌కి కేటీఆర్ పరామర్శ

ఖమ్మం, జూలై 14 : అనారోగ్యంతో బాధపడుతున్న ఖమ్మం మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ ఆదివారం హైదరాబాద్‌లోని పువ్వాడ ఇంట్లో పరామర్శించారు. ఈ సందర్భంగా అనారోగ్యానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్యం బాగుపడే వరకు ఇతరత్రా పనులు ఏమీ పెట్టుకోకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అజయ్‌ను పరామర్శించిన వారిలో బీఆర్ఎస్ నాయకుడు బాల్క సుమన్ తదితరులు ఉన్నారు.



మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌ను పరామర్శిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్, చిత్రంలో సుమన్, కౌశిక్‌రెడ్డి తదితరులు

## పేదలందరికీ ప్రభుత్వ ఫలాలు

### సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీలో మంత్రి పొంగులేటి



సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న మంత్రి పొంగులేటి

కూసుమంచి, జూలై 14: పేదలందరికీ ప్రభుత్వ ఫలాలు అందినప్పుడే తమ ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి, పాలేరు ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కూసుమంచిలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు చెందిన 132 మంది లబ్ధిదారులకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హత గల ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చూడాల్సి బాధ్యత అధికారులపై ఉందని అన్నారు. అనంతరం ఆర్టీసీ కార్మికులు సహా వివిధ సంఘాల బాధ్యులు, ఇతర ప్రజలు ఇచ్చిన వినతిపత్రాలను స్వీకరించారు. ఆర్డీవో గణేశ్, ఏసీపీ తిరుపతిరెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు బెల్లం శ్రీను, బానోత్ శ్రీనివాస్, హేమలత, వెంకటేశ్వర్లు, పుష్పలత, సురేశ్ కుమార్, వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

### మంత్రి పొంగులేటితో కలెక్టర్ సమావేశం

కూసుమంచిలోని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయంలో మంత్రితో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదివారం సమావేశమయ్యారు. కూసుమంచికి మంజూరైన 100 బెడ్ల ఆసుపత్రి స్థలం, నర్సింగ్ కాలేజీ, జూనియర్ కాలేజీల స్థలాలు, పాలిటెక్నిక్ కళాశాల స్థల సేకరణ, ఇతర అంశాలపైనా చర్చించారు.

## పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

### ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి



పనులను పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న ఖమ్మం ఎంపీ రఘురాంరెడ్డి

కొత్తగూడెం అర్బన్, జూలై 14: జిల్లా కేంద్రమైన కొత్తగూడెంలోని రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి అన్నారు. మొదటిసారిగా ఎంపీ హోదాలో కొత్తగూడెం నియోజకవర్గానికి వచ్చిన ఎంపీకి రైల్వేస్టేషన్ ప్రాంగణంలో కాంగ్రెస్ నాయకులు, రైల్వే అధికారులు గజమాల వేసి ఘనస్వాగతం పలికారు. రైల్వేస్టేషన్‌లో జరుగుతున్న పనుల గురించి ఎంపీకి అధికారులు వివరించారు. ప్రయాణికులకు ఎటువంటి ఆటంకం కలిగించవద్దని, భద్రాచలం రైల్వేస్టేషన్ నుంచి గతంలో రద్దైన పలు రైళ్లను పునరుద్ధరించాలని కోరారు. పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని సూచించారు. కార్యక్రమంలో స్టేషన్ మాస్టర్ విశ్వనాథ్, రైల్వే అధికారులు రాం భజన్ వీణ, పాషా, రాజారెడ్డి, ఎండీ ఇర్ఫాన్, ఎండీ జావీద్, జేమ్స్ పాల్, ఖాజా బాబా, జడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, ఆళ్ల మురళి, కోనేరు సత్యనారాయణ, నాగ సీతారాములు, గోపాలరావు, రైల్వే సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం కొత్తగూడెంలో విలేకరుల సమావేశంలో ఎంపీ రఘురాంరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మంచి మెజార్టీని అందించిన ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలిపారు. శక్తివంచన లేకుండా ఖమ్మం ఎంపీ నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడతానని అన్నారు. సమావేశంలో జడ్పీ చైర్మన్ చంద్రశేఖర్‌రావు, టీపీసీసీ మెంబర్ నాగ సీతారాములు, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవీ ప్రసన్న, ఆళ్ల మురళి, నాగేంద్ర త్రివేది, గోపాల్‌రావు పాల్గొన్నారు.

# చిగురిస్తున్న ఆశలు

- అల్పపీడనం ప్రభావంతో వారం రోజులుగా వర్షాలు
- జిల్లాలో నిరుటికంటే ఈ ఏడాది మెరుగ్గా వర్షపాతం
- 'ఖమ్మం'లో ఇప్పటికే 1.82 లక్షల ఎకరాల్లో పంటలు
- వరి సాగుకు సిద్ధమవుతున్న అన్నదాతలు

ఖమ్మం రూరల్: ఎం.వెంకటాయపాలెంలో సాగవుతున్న పత్తి పంట



ఖమ్మం వ్యవసాయం, జూలై 14: బంగాళాఖాతంలో చాలా రోజుల తరువాత అల్పపీడనం ఏర్పడడం, ఆ ప్రభావం జిల్లాపై కనపడుతుండడంతో జిల్లా రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. గత వానకాలం సీజన్‌లో వరుణుడు ముఖం చాటేయడంతో అన్నదాతలు తీవ్రంగా ఆందోళన చెందారు. సరైన వర్షాలు లేకపోవడంతో చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు పూర్తిగా అడుగంటాయి. దీనికి తోడు సాగర్ కాలువ ద్వారా సైతం నీరు విడుదల కాకపోవడంతో యాసంగి సాగు ప్రశ్నార్థకమైన విషయం విదితమే. చివరికి ఆయకట్టు ప్రాంతం పూర్తిగా ఎడారిగా మారిన సంగతి తెలిసిందే. దాదాపు దశాబ్దకాలం తర్వాత గత సంవత్సరం అత్యల్పంగా సాగుకావడం గమనార్హం. గత ఏడాది నీటి వనరులు పూర్తిగా ఎండిపోవడంతో ఈ సంవత్సరం జలశయాలు నిండడం కష్టతరంగా మారింది. అయితే గతేడాదితో పోల్చుకుంటే ఈ సంవత్సరం వర్షపాతం చాలా మెరుగ్గా ఉందని అధికారులు చెబుతున్నారు. దీంతోపాటు ప్రస్తుతం బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడడంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందనే ఆశాభావంలో రైతులు ఉన్నారు. ఇప్పటికే మెట్ట పంటల సాగు పూర్తి చేసిన రైతులు.. వర్షపాతాన్ని బట్టి వరి పొలాలను దమ్ము చేసే ఆలోచనలో ఉన్నారు. అల్పపీడనం ప్రభావంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు తోడు రాబోయే నాలుగు రోజులు సైతం భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ ప్రకటించడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### వర్షాలు కురుస్తుండడంతో..

ఒక్కసారిగా వాతావరణంలో మార్పులు రావడం, అల్పపీడనం ప్రభావంతో విస్తారంగా వర్షాలు కురుస్తుండడంతో అన్నదాతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. గత సంవత్సరం రెండు సీజన్లలో సైతం జిల్లాలోని సాగర్ ఎడమ కాలువ పరివాహక ప్రాంతం పూర్తిగా బీడుభూములుగా తయారైంది. జిల్లాలో మొత్తం 21 మండలాలకు 16 మండలాలు సాగర్ కాలువ పరీవాహక ప్రాంతాలుగా ఉన్నాయి. ఈ మండలాల పరిధిలో సుమారుగా ఆయకట్టు సాగు ప్రతి ఏటా 2 లక్షల ఎకరాల్లో సాగు జరుగుతుండగా మరో 50వేల ఎకరాల్లో మెట్ట పంటల సాగు జరుగుతున్నది. ఈ సంవత్సరం నేటివరకు వరి పంట సాగుకు సంబంధించి సత్తుపల్లి మండలంలోనే 12 వేల ఎకరాల్లో వరినాట్లు ప్రక్రియ పూర్తి అయ్యింది. మిగిలిన మండలాల్లో రైతులు నారుమడులు పోసి భారీ వర్షాలు, సాగర్ కాలువ నీటి కోసం వేచి చూస్తున్నారు. పత్తి సాగు 21 మండలాల్లో కలిసి 1.82 లక్షల ఎకరాల్లో సాగు కాగా, పెసర సాగు చింతకాని, కొణిజర్ల మండలాల్లో అత్యధికంగా 10 వేల ఎకరాల్లో సాగు జరిగింది. వ్యవసాయశాఖ సాగు లక్ష్యం నెరవేరాలంటే వరి సాగు మరో 2 లక్షల ఎకరాలు, మిర్చి సాగు 80 వేల ఎకరాల్లో సాగు జరగాల్సి ఉంది.

### పంటల సాగు వివరాలు

| పంట | సాధారణ సాగు (ఎకరాల్లో) | గత ఏడాది (ఎకరాల్లో) | ఈ ఏడాది (ఎకరాల్లో) |
|---|---|---|---|
| వరి | 2,75 143 | 8,497 | 36,517 |
| మొక్కజొన్న | 3,984 | 387 | 1,363 |
| కంది | 2,131 | 82 | 117 |
| పెసర | 17,034 | 5,384 | 12,354 |
| మినుము | 203 | 38 | 51 |
| వేరుశనగ | 157 | 02 | 40 |
| పత్తి | 2,36,656 | 1,06,740 | 1,82 304 |
| మొత్తం | 5,22,327 | 1,21,130 | 2,32 746 |

### ఆశాజనకంగా వర్షపాతం..

గత ఏడాదితో పోల్చితే ఈ సంవత్సర వర్షపాతం ఆశాజనకంగా ఉంది. గడచిన 24 గంటల్లో జిల్లా వ్యాప్తంగా 28.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా చింతకాని మండలంలో 47.2 మి.మీ నమోదైంది. ఈ ఏడాది జూన్ 1 నుంచి జూలై 12వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా 305.3 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జిల్లా సాధారణ వర్షపాతం 213 మి.మీ కాగా 43 మి.మీ అధికంగానే నమోదైంది. గత ఏడాది జూన్ 1 నుంచి జూలై 12వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా సగటు వర్షపాతం కేవలం 108.8 మి.మీ మాత్రమే నమోదైంది. కామేపల్లి, ఏన్కూరు మండలాల్లో ఈ సంవత్సరం సాధారణ వర్షపాతం నమోదు కాగా, ఎర్రుపాలెం, సింగరేణి మండలాల్లో సాధారణం కంటే తక్కువ నమోదైంది. మిగిలిన మండలాల్లో సాధారణం కంటే ఎక్కువగానే నమోదైంది.

## ప్రభుత్వ వైద్యుల పరేషాన్

- బదిలీల్లో ఇష్టారాజ్యంగా ప్రభుత్వ ఉత్తర్వుల జారీ
- తిరుమలాయపాలెం, వైరాల్లో కానరాని స్పెషలిస్ట్ పోస్టులు
- నాడు 100 బెడ్లకు అప్‌గ్రేడ్ చేసిన కేసీఆర్ ప్రభుత్వం
- నేడు దానిని తుంగలో తొక్కిన కాంగ్రెస్ సర్కారు
- దిక్కుతోచని స్థితిలో ఖమ్మం జిల్లా స్పెషలిస్ట్ వైద్యులు
- ముగ్గురు మంత్రులూ దృష్టిసారించడం లేదని ఆవేదన





ఖమ్మం సిటీ, జూలై 14: ఏదైనా జబ్బు చేస్తే రోగులు ఆందోళన చెందడం సహజం. వారికి వైద్యులు మనో నిబ్బరాన్ని కలిగించి సేవలందిస్తుంటారు. కానీ, కాంగ్రెస్ సర్కారులో మాత్రంలో ప్రత్యక్ష దైవాలుగా భాసిల్లుతున్న ప్రభుత్వ వైద్యులు కూడా పరేషాన్ అవుతున్నారు. స్పష్టత, ముందుచూపు లేకుండా ఇస్తున్న జీవోలను చూసి అవాక్కవుతున్నారు. ఎక్కడి కెళ్లాలో, ఏ పని చేయాలో తెలియక తలలు పట్టుకుంటున్నారు. గత కేసీఆర్ పదేళ్ల ఏనాడూ ఇంతటి దురదృష్టకర పరిణామాలను ఎదుర్కోలేదని వాపోతున్నారు. ఇంతకూ వారికొచ్చిన కష్టమేంటి? ఎందుకింత మదన పడుతున్నారు? హస్తం పార్టీ పాలకులు ప్రకటించుకున్న ప్రజాపాలనలో తీవ్ర గందరగోళంగా మారిన ప్రభుత్వ వైద్యుల బదిలీలపై 'నమస్తే తెలంగాణ' అందిస్తున్న ప్రత్యేక కథనం.

జిల్లాలోని ప్రభుత్వ వైద్యులు పరేషాన్ అవుతున్నారు. ప్రధానంగా వైద్య విధాన పరిషత్‌కు చెందిన వారు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు. దీనికి ప్రధాన కారణం ఇటీవల కాలంలో రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన బదిలీ ఉత్తర్వులే. ఎంతో ఆవశ్యకమైన వైద్యరంగం పట్ల సానుకూల, శాస్త్రీయ పద్ధతుల్లో నిర్ణయాలు తీసుకోవాల్సి ఉన్నప్పటికీ.. పాలకులు అనాలోచితంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పలు ఏరియా ఆసుపత్రుల్లో స్పెషలిస్ట్ వైద్యుల పోస్టులను కానరాకుండా చేసి.. ఆప్షన్లు అడగడం వైద్యులను ఆశ్చర్యానికి గురి చేసింది. వీటిల్లో తిరుమలాయపాలెం, వైరా ఆసుపత్రులున్నాయి. ఈ రెండింటితోపాటు మధిర, సత్తుపల్లి దవాఖానలను నాటి కేసీఆర్ సర్కారు 100 బెడ్ల ఆసుపత్రులుగా అప్‌గ్రేడ్ చేసింది. నేలకొండపల్లి, కల్లూరు, పెనుబల్లి ఆసుపత్రుల్లో 24 గంటలపాటు సేవలను అందుబాటులోకి తెచ్చింది. ఆ క్రమంలోనే తిరుమలాయపాలెం, వైరా దవాఖానలకు స్పెషలిస్ట్ వైద్యులను ప్రకటించింది. నర్సింగ్, ఇతర సిబ్బందిని నియమించింది. రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగి కాంగ్రెస్ సర్కార్ వచ్చిన తర్వాత జిల్లా ఆసుపత్రులు, స్థానిక వైద్యుల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

**కానరాని స్పెషలిస్ట్ వైద్యుల పోస్టులు..**

జిల్లా సార్వజనీన ఆసుపత్రిని నాడు కేసీఆర్ ప్రభుత్వం ఖమ్మంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనుసంధానం చేసింది. ఆ క్రమంలో పెద్దాసుపత్రి డీఎంఈ పరిధిలోకి వెళ్లింది. దీంతో ఇక్కడ పనిచేస్తున్న వైద్య విధాన పరిషత్‌కు చెందిన వైద్యులు, నర్సింగ్, ఇతర సిబ్బంది అంతా ఏరియా ఆసుపత్రులుగా అప్‌గ్రేడ్ అయిన మధిర, సత్తుపల్లి, తిరుమలాయపాలెం, వైరా, నేలకొండపల్లి, పెనుబల్లి, కల్లూరులకు వెళ్లారు. వారిలో స్పెషలిస్ట్ వైద్యుల్లో సీనియర్లంతా ఖమ్మానికి దగ్గరలోని తిరుమలాయపాలెం, వైరా, నేలకొండపల్లి దవాఖానలను ఎంచుకున్నారు. కాంగ్రెస్ సర్కార్ తీసుకున్న బదిలీల ప్రక్రియ ఆప్షన్లలో తిరుమలాయపాలెం, వైరా ఏరియా ఆసుపత్రుల్లో 100 బెడ్ల అప్‌గ్రేడ్‌తోపాటు స్పెషలిస్ట్ (ఈఎన్‌టీ, ఆర్థోపెడిక్, ఆప్తమాలజీ, సివిల్ సర్జన్) పోస్టులు కానరావడం లేదు. 'నాటి కేసీఆర్ సర్కార్ హయాంలో ఉన్న పోస్టులు ఇప్పుడెక్కడికి పోయాయి?' అనే సందేహాన్ని పలువురు వైద్యులు వ్యక్తం చేశారు.

**భద్రాచలం ఆసుపత్రిలోనూ అదే తంతు..**

దీర్ఘకాలికంగా పనిచేస్తున్నారనే కారణంతో భద్రాచలం ఏరియా దవాఖానలో విధులు నిర్వర్తిస్తున్న తొమ్మిది మంది వైద్యులను ప్రభుత్వం బలవంతంగా బదిలీ చేసింది. ఇక్కడికి ఎవరైనా ఆప్షన్ ఇచ్చినా, ఇవ్వకపోయినా వెళ్లిపోవాల్సిందేనంటూ ఆదేశాలిచ్చింది. కొత్తగూడెంలోని సర్కారు దవాఖాన కూడా డీఎంఈ పరిధిలోకి వెళ్లడంతో స్పెషలిస్ట్ వైద్యులు మణుగూరు లేదా అశ్వారావుపేట ఏరియా దవాఖానల బాట పట్టాల్సిందే. పూర్తిగా ఏజెన్సీ ప్రాంతానికి చెందిన భద్రాచలం వెళ్లాలంటే ఏ ఒక్కరూ ముందుకు అడుగేయరు. ప్రమోషన్ ఇచ్చి పంపినా ప్రభుత్వ విభాగాలకు చెందిన వారు పనిష్మెంట్‌గానే భావిస్తారు. అలాంటిది బదిలీల ప్రక్రియలో ఆప్షన్లు కోరితే ఎవరు వస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈ విధమైన జీవోలు జారీ చేయడం వల్ల తిరిగి యథాస్థానంలో కొనసాగించేందుకు వైద్యులు తమ వద్దకు వస్తే గట్టిగా చేతివాటం ప్రదర్శించవచ్చని రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు భావిస్తున్నారేమోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా, జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ కీలకమైన వైద్యరంగం పట్ల దృష్టిసారించడం లేదని వైద్యులు వాపోతున్నారు.

## ఎస్సై కుటుంబానికి రూ.25 లక్షల సాయం

- 2014 బ్యాచ్ సివిల్ ఎస్సైల టీఎస్, ఏపీ వెల్ఫేర్ సొసైటీ చేయూత
- నారక్కపేటలో శ్రీను చిత్రపటం వద్ద నివాళులర్పించిన బ్యాచ్‌మేట్స్



ఎస్సై శ్రీను కుటుంబానికి చెక్కును అందజేస్తున్న టీఎస్, ఏపీ ఎస్సైల వెల్ఫేర్ సొసైటీ బృందం

నల్లబెల్లి, జూలై 14: ఇటీవల ఆత్మహత్య చేసుకున్న అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీను కుటుంబానికి 2014 బ్యాచ్ సివిల్ ఎస్సైల టీఎస్, ఏపీ వెల్ఫేర్ సొసైటీ బాధ్యులు చేయూతనందించారు. రూ.25 లక్షల ఆర్థికసాయాన్ని సేకరించారు. ఆ మొత్తానికి సంబంధించిన చెక్కును అతడి సతీమణికి ఆదివారం అందజేశారు. అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీను ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్సపొందుతూ ఈ నెల 7న మృతిచెందిన విషయం విదితమే. కాగా, సివిల్ ఎస్సైల టీఎస్, ఏపీ వెల్ఫేర్ బాధ్యులు ఆదివారం నల్లబెల్లి మండలంలోని నారక్కపేట గ్రామానికి ఆదివారం చేరుకున్నారు. శ్రీను చిత్రపటం వద్ద నివాళులర్పించారు. శ్రీను కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం సొసైటీ అధ్యక్షుడు ఎస్సై శ్రీధర్ ఆధ్వర్యంలో మృతుడి భార్య కృష్ణవేణికి రూ.25 లక్షల ఆర్థికసాయం చెక్కును అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2014 ఎస్సైల బ్యాచ్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి 747 మందిమి ఉన్నామని అన్నారు. అందులో సభ్యుడైన ఎస్సై శ్రీను మృతి తీరని లోటు అని అన్నారు. అతడి కుటుంబానికి తమ సొసైటీ ఎల్లవేళలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎస్సైలు రామకృష్ణ, శ్రీనివాస్, రామారావు, పరమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ఆఫీస్ ఎదుట ఆటోడ్రైవర్ల నిరసన



ఖమ్మం కాంగ్రెస్ ఆఫీస్ ఎదుట నిరసన తెలుపుతున్న ఆటోడ్రైవర్లు

మామిళ్లగూడెం, జూలై 14: ఆటోడ్రైవర్ల పట్ల ఐఎన్‌టీయూసీ వైఖరిని నిరసిస్తూ ఆటోవర్కర్స్ యూనియన్ జిల్లా, నగర కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మంలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయం(సంజీవ్‌రెడ్డి భవనం) వద్ద నిరసన వ్యక్తంచేశారు. ఆదివారం సంజీవ్‌రెడ్డి భవనంలో జరిగిన ఆటోవర్కర్స్ యూనియన్ సమావేశాన్ని ఆటో కార్మికులు బహిష్కరించి పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన వారిని గుర్తించకుండా కొత్తవారికి యూనియన్ బాధ్యతలు ఇస్తామనడంపై కార్మికులంతా మండిపడ్డారు. యూనియన్ జిల్లా అధ్యక్షుడిగా విప్లవ్‌కుమార్‌నే కొనసాగించాలని నాయకులను డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ నగర ఉపాధ్యక్షుడు గయజ్ పాషా మాట్లాడుతూ తనపై నగర అధ్యక్షుడు నరాల నరేశ్ కొంతమందిని హత్యకు పురమాయించాడని ఆరోపించాడు. ఈ విషయాన్ని జిల్లా కమిటీ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని వాపోయాడు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకత్వం జోక్యం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా రెండువర్గాలుగా విడిపోయిన ఆటో కార్మికులు పెద్దఎత్తున నినాదాలు చేశారు.

# అమ్మకు ఆషాఢ బోనం

- వాడల్లో శివసత్తుల నృత్యాలు, పోతురాజుల విన్యాసాలు
- జిల్లాలో సందడిగా మారిన అమ్మవార్ల ఆలయ పరిసరాలు



ఆషాఢమాసం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో బోనాల పండుగ ఆదివారం వైభవంగా జరిగింది. ఖమ్మం, సత్తుపల్లి, నేలకొండపల్లి ప్రాంతాల ప్రజలు అమ్మవారికి ప్రీతిపాత్రమైన బోనాలు సమర్పించారు. ఖమ్మం త్రీటౌన్‌లోని పలు కాలనీలకు చెందిన ప్రజలు ఏటా ఆషాఢమాసంలో అమ్మోరు తల్లికి బోనాలు సమర్పించడం ఆనవాయితీ. అందులో భాగంగానే ఈ ఆదివారం కూడా ఆయా కాలనీల మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలతో బయలుదేరారు. డప్పువాయిదాలు, శివసత్తులు నృత్యాలు, పోతురాజుల విన్యాసాలు, ఆటాపాటలు, నృత్యాలతో వెళ్లి ఆ బోనాలను అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. శ్రావణమాసానికి ముందుగా వచ్చే ఆషాఢబోనాలను అమ్మవారికి సమర్పించే వేడుక కావడంతో ఖమ్మం పరిసర ప్రాంతాల నుంచి కూడా ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సత్తుపల్లి, నేలకొండపల్లి, జూలూరుపాడు, అశ్వారావుపేట మండలాల ప్రజలు కూడా ముత్యాలమ్మ అమ్మవారికి, అంకమ్మతల్లికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పుష్కలంగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు.

*– ఖమ్మం వ్యవసాయం/సత్తుపల్లి/జూలూరుపాడు/అశ్వారావుపేట టౌన్/కూసుమంచి (నేలకొండపల్లి), జూలై 14*



ఖమ్మంలో బోనాలతో వెళ్తున్న కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు



ఖమ్మం రూరల్‌లో..



సత్తుపల్లిలో..



ఖమ్మంలో శివసత్తుల విన్యాసాలు



నేలకొండపల్లిలో..





జూలూరుపాడు: ఆలయానికి బోనాలతో పోటెత్తిన భక్తులు



అశ్వారావుపేట టౌన్: బోనాలతో వెళ్తున్న మహిళలు